క్లుప్తంగా...

కరెంట్ ఉండని ప్రాంతాలు

మేడ్చల్: రాజబొల్లారం సబ్ స్టేషన్ పరిధిలో చెట్ల కొమ్మలు నరికివేత కారణంగా శుక్రవారం పలు ప్రాంతాల్లో కరెంట్ సరఫరా ఉండదని ఏఈ శశిధర్‌రెడ్డి తెలిపారు. సబ్ స్టేషన్ పరిధిలోని వివిధ పరిశ్రమల ఫీడర్ల పరిధిలోని పరిశ్రమలకు ఉదయం 10 నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఆయన తెలిపారు.

నేడు మంత్రి పర్యటన

మేడ్చల్: మండలంలోని వివిధ గ్రామాల్లో మంత్రి మల్లారెడ్డి పర్యటిస్తారని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దయానంద్‌యాదవ్ తెలిపారు. మండలంలోని రాజబొల్లారం, రాజబొల్లారం తండా, మునీరాబాద్, పూడూర్ గ్రామాల్లో మంత్రి పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకుంటారని తెలిపారు.

కలెక్టరేట్ వద్ద ఉపాధ్యాయుల ధర్నా

సాక్షి, మేడ్చల్ జిల్లా: అపరిష్కృతంగా విద్యారంగంలో ఉన్న ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలంటూ గురువారం కలెక్టరేట్ వద్ద తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(టీపీయూఎస్) ధర్నా నిర్వహించింది. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, మంత్రులకు తమ సమస్యలపై ఎన్నోసార్లు వినతి పత్రాలు ఇచ్చినా నిరసనలు, ఉద్యమాలు చేసినా ఎలాంటి పురోగతి లేకపోవడంతో ఆందోళన చేస్తున్నట్లు చెప్పారు. ధర్నా అనంతరం డీఈఓ విజయకుమారికి వినతి పత్రం అందజేశారు.

అందరూ మొక్కలు నాటాలి



ఆర్టీసీ కాలనీలో మొక్కలను అందజేస్తున్న కౌన్సిలర్ మానస

మేడ్చల్: పట్టణంలోని వివిధ వార్డుల్లో కౌన్సిలర్లు మహిళలు, ప్రజలకు మొక్కలను పంపిణీ చేశారు. ఒకటో వార్డులో కౌన్సిలర్ మానస శ్రవణ్‌కుమార్‌గుప్తా, వైస్ చైర్మన్ రమేష్‌లు తమ వార్డులో మొక్కలను పంపిణీ చేసి అందరూ మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. పట్టణంలోని సూర్యనగర్, శ్రీనివాసనగర్‌కాలనీ, ఆర్టీసీ కాలనీ తదితర కాలనీల్లో మొక్కలను అందజేశారు.

సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం



సీఎంకు అభిషేకం చేస్తున్న రేషన్ డీలర్లు

మేడ్చల్: తమ కమీషన్ పెంచడంతో మండల రేషన్ డీలర్లు సీఎం కేసీఆర్‌కు ధన్యవాదాలు తెలుపుతూ ఆయన చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద సీఎం చిత్రపటానికి పాలతో అభిషేకం చేసి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో డీలర్లు రాజు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఐటీ కళాశాలకు ఎడ్యుకేషనల్ ఎక్సలెన్స్ అవార్డు



అవార్డుతో సీఎంఆర్ఐటీ కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలోని సీఎంఆర్ఐటీ కళాశాలకు ప్రతిష్టాత్మక ఎడ్యుకేషనల్ ఎక్సలెన్స్ అవార్డు దక్కింది. ప్రపంచ తెలుగు సమాచార సాంకేతిక మండలి తన మొదటి అంతర్జాతీయ సమావేశాన్ని ఈ నెల 5, 6 తేదీల్లో సింగపూర్‌లో నిర్వహించింది. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీలో తెలుగు రాష్ట్రాల్లోని కళాశాలలు పాల్గొనగా సీఎంఆర్ఐటీ కళాశాలకు ఎడ్యుకేషనల్ ఎక్సలెన్స్ అవార్డు లభించింది. కళాశాల డైరెక్టర్ జంగారెడ్డి అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యం, ప్రిన్సిపాల్ సత్యనారాయణలు హర్షం వ్యక్తం చేశారు.

అక్రమ నిర్మాణాలు చేపడితే క్రిమినల్ కేసులు



జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలోని ప్రభుత్వ భూముల్లో వెలసిన అక్రమ నిర్మాణాలను గురువారం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ విశ్వనాథ్ ఆధ్వర్యంలో జేసీబీతో కూల్చివేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ భూములను కబ్జా చేసి అమాయక ప్రజలకు ప్లాట్లు కట్టబెడుతూ మోసాలకు పాల్పడుతున్నారన్నారు. ప్రభుత్వ భూములను కబ్జా చేస్తే ఊరుకునేది లేదని, వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు.

పర్యవేక్షణ కొరవడి.. గాడి తప్పుతున్న బడి

- ఈ ఇన్‌చార్జ్‌లు అంతా పాఠశాల ప్రధానోపాధ్యాయులు
- ఒక్కో ఇన్‌చార్జి ఎంఈఓకు 5 నుంచి 7 మండలాల బాధ్యతలు
- జిల్లాలో 505 ప్రభుత్వ, 10 ఎయిడెడ్, 1350 ప్రైవేట్ పాఠశాలు
- ఈ బడుల్లో చదువుతున్న విద్యార్థుల సంఖ్య 5.10 లక్షలు
- మండలాల్లో పర్యటనలు లేక చతికిల పడుతున్న విద్యావ్యవస్థ

జిల్లాలో అన్ని మండలాలకు ఎంఈఓలు అంతా ఇన్‌చార్జిలే..



సాక్షి, మేడ్చల్ జిల్లా: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులే ఇన్‌చార్జి ఎంఈవోలుగా అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. అలాగే, ఒక్కో ఇన్‌చార్జి ఎంఈఓకు 5 నుంచి 7 మండలాలను అదనపు బాధ్యతగా పర్యవేక్షించాల్సి పరిస్థితి జిల్లా విద్యాశాఖలో కొన్నేళ్లుగా కొనసాగుతోంది. గతంలో మాదిరిగా ఎంఈఓల పర్యవేక్షణ సరిగ్గా లేకపోవడంతో బడి గాడి తప్పుతోందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. హెచ్‌ఎంలకు ఇన్‌చార్జ్ ఎంఈఓలుగా అదనపు బాధ్యతలను అప్పగించడంతో వారు విధులు నిర్వర్తిస్తున్న ఉన్నత పాఠశాలలకు, అటు ఎంఈవో పదవులకు పూర్తిస్థాయిలో న్యాయం చేయలేకపోతున్నారు. ఫలితంగా ప్రభుత్వం విద్యాశాఖలో అనేక సంస్కరణలు చేపడుతున్నా.. కార్యరూపం దాల్చడంలో జాప్యం జరుగుతోందన్న ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. ఇన్‌చార్జి ఎంఈవోగా అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్న హెచ్‌ఎంలు తమ బడితో పాటు కనీసం 20 పాఠశాలలను నెలలో పర్యవేక్షించాల్సి ఉన్నా.. అది నెరవేరడం లేదని తెలుస్తోంది.

◆ జిల్లాలో 505 ప్రభుత్వ పాఠశాలలు, 10 ఎయిడెడ్ పాఠశాలలు, 1,350 ప్రైవేట్ పాఠశాలలు ఉండగా, ఇందులో 5.10 లక్షల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ముగ్గురు ఇన్‌చార్జి ఎంఈఓలు తమ మండలాల పరిధిలోని పాఠశాలల పర్యటనతో సహా అధికారిక కార్యక్రమాలు, మన ఊరు–మన బస్తీ–మన బడి పర్యవేక్షణ, సమీక్షలకు హాజరు కావడం, మధ్యాహ్న భోజన నివేదికలు, మరుగుదొడ్లు, తాగునీరు అదనపు గదుల నిర్మాణాలు, బోధన, ఉపాధ్యాయుల శిక్షణ తరగతులు, విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు పర్యవేక్షణ, జీతభత్యాలు, నివేదికలు పంపడం వంటి పనులకే వారి సమయం సరిపోతోంది.

◆ జిల్లాలో మొత్తంగా ఉన్న 15 మండలాలకు ముగ్గురు హెచ్‌ఎంలు ఇన్‌చార్జి ఎంఈవోలుగా విధులు నిర్వహిస్తున్నారు. భగత్‌సింగ్‌నగర్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం బాలానగర్, బాచుపల్లి, కుత్బుల్లాపూర్, దుండిగల్, కూకట్‌పల్లి మండలాలకు ఇన్‌చార్జి ఎంఈఓగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. తూముకుంట ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కూడా మేడ్చల్, శామీర్‌పేట, ఎంసీపల్లి మండలాలకు ఇన్‌చార్జ్ ఎంఈఓగా అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. కీసర ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కూడా మిగిలిన మల్కాజిగిరి, అల్వాల్, ఘట్‌కేసర్, ఉప్పల్, మేడిపల్లి, కీసర, కాప్రా మండలాలకు ఇన్‌చార్జ్ ఎంఈఓగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ప్రధానోపాధ్యాయులకు ఎంఈఓగా అదనపు బాధ్యతలను అప్పగించడంతో పర్యవేక్షణ కొవబడి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పడిపోతున్నాయనే విమర్శలు విద్యార్థులు తల్లి దండ్రుల నుంచి వ్యక్తమవుతున్నాయి.

ప్రతిష్టంభన..

పాఠశాలల పర్యవేక్షణ బాధ్యతలను జిల్లాస్థాయిలో డీఈవో, సెక్టోరియల్ అధికారులు మాత్రమే చూస్తున్నారు. ప్రభుత్వం జిల్లా ఉప విద్యాధికారుల పోస్టులను ఎత్తివేసింది. రెండు దశాబ్దాలుగా ఉపాధ్యాయుల ఏకీకృత సర్వీసు నిబంధనలు అమలులో నెలకొన్న జాప్యంతో పదోన్నతుల ప్రక్రియలో ప్రతిష్టంభన నెలకొంది. ఈ కారణంగా ఎంఈవోల నియామకం జరగడం లేదు. జిల్లాలో మొత్తంగా ఉన్న 15 మండలాలకు ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులే ఇన్‌చార్జ్ ఎంఈవోలుగా విధులు నిర్వర్తిస్తున్నారు.

సీఎంగా కేసీఆర్ ఉండటం ఉద్యోగుల అదృష్టం

సాక్షి, మేడ్చల్ జిల్లా: తెలంగాణకు సీఎంగా కేసీఆర్ ఉండటం ప్రభుత్వ ఉద్యోగులకు అదృష్టమని, వారికి అన్ని విధాలుగా న్యాయం జరుగుతోందని మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ''నిన్నటి గ్రామ రెవెన్యూ సహాయకులు – నేటి ప్రభుత్వ ఉద్యోగులు'' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లాలోని 131 మంది వీఆర్‌ఏలకు జిల్లా కలెక్టర్ అమయ్ కుమార్‌తో కలిసి ప్రభుత్వ ఉద్యోగ నియామక పత్రాలను ఆయన పంపిణీ చేశారు. ముఖ్యమంత్రి ఎల్లప్పుడూ ప్రజలు, ఉద్యోగుల శ్రేయస్సు కోసం పరితపిస్తుంటారని మంత్రి మల్లారెడ్డి అన్నారు. అలాంటి ముఖ్యమంత్రి తెలంగాణకు ఉండటం ప్రభుత్వ ఉద్యోగుల అదృష్టమని పేర్కొన్నారు. గ్రామ రెవెన్యూ సహాయకులుగా విధులు నిర్వహించిన సమయంలో రూ.11,500 వేతనం ఉండగా ప్రస్తుతం ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా వేతనం, ఇతర సౌకర్యాలు, వసతులు కల్పించడం జరుగుతుందని పేర్కొన్నారు. గతంలో ఏ ప్రభుత్వాలు కూడా ఇలాంటి గొప్ప నిర్ణయాలు తీసుకోలేదన్నారు. జిల్లా కలెక్టర్ అమయ్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉత్తర్వులు 81 ప్రకారం వీఆర్‌ఏల విద్యార్హతల ఆధారంగా వివిధ శాఖల్లో జూనియర్ అసిస్టెంట్, రికార్డు అసిస్టెంట్, ఆఫీస్ సబార్డినేట్, హెల్పర్లు, వార్డు మెంబర్లుగా నియమించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు విజయేందర్‌రెడ్డి, అభిషేక్ అగస్త్య, జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ, కలెక్టరేట్ ఏవో రాంమోహన్, జిల్లాస్థాయి అధికారులు, తహసీల్దార్లు, వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

మహిళల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి



మాట్లాడుతున్న మంత్రి మల్లారెడ్డి

కీసర: బీఆర్‌ఎస్ ప్రభుత్వం పొదుపు సంఘాల మహిళల అభ్యున్నతికి పాటుపడుతోందని మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. గురువారం కీసర మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో నిర్వహించిన స్నేహ మహిళా పరస్పర సహాయ సహకార పొదుపు, పరపతి సొసైటీ లిమిటెడ్ సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పొదుపు సంఘాలకు అందజేస్తున్న పావలా వడ్డీ రుణాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మహిళా గ్రూప్ సంఘాల సభ్యులు ఆర్థికంగా ముందుకెళ్లేందుకు తన వంతు సహాయ సహకారాలు పూర్తిగా అందించనున్నట్లు తెలిపారు. 31 గ్రూప్‌లకు పావలా వడ్డీ కింద మంజూరైన రుణాల చెక్కులను ఆయన పంపిణీ చేశారు. బీఆర్‌ఎస్ కీసర మండల అధ్యక్షుడు జాలాల్‌పురం సుధాకర్‌రెడ్డి మహిళలకు భోజన వసతి ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మహిళా సొసైటీ అధ్యక్షుడు వనజ, సెక్రటరీ పద్మ, మేనేజర్ కవిత, వీణ, ఎంపీపీ మల్లారపు ఇందిరాలక్ష్మీనారాయణ, జెడ్పీ వైస్ చైర్మన్ బెస్త వెంకటేష్, వైస్ ఎంపీపీ జె.సత్తిరెడ్డి, మాజీ ఎంపీపీ రామారం సుజాత, సర్పంచులు నాయకపు మాధురివెంకటేష్, వివిధ గ్రామాల ఎంపీటీసీ సభ్యులు, మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు బషరత్ అలీ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే అభివృద్ధి



పనులను ప్రారంభిస్తున్న మేయర్ కావ్య, డిప్యూటీ మేయర్ శ్రీనివాస్, కార్పొరేటర్ లావణ్యసతీష్‌గౌడ్

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ 22వ డివిజన్ కార్పొరేటర్ బింగి లావణ్యసతీష్‌గౌడ్ ఆధ్వర్యంలో నవరస గార్డెన్ కాలనీలో రూ.5 లక్షలతో నిర్మించే అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను గురువారం మేయర్ కావ్య, డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్ హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. మంత్రి మల్లారెడ్డి సహకారంతో జవహర్‌నగర్ కార్పొరేషన్ రాష్ట్రంలోనే ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. జవహర్‌నగర్‌లో అభివృద్ధి పనులు శరవేగంగా కొనసాగుతున్నాయన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రాంచందర్, నాయకులు సాధిక సత్తయ్య, అశోక్, మధుస్వామి, కాలనీవాసులు పాల్గొన్నారు.

కాలనీలో సమస్యలను పరిష్కరిస్తాం



సిలికాన్ కాలనీలో పర్యటిస్తున్న మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి అధికారులు

కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని మూడవ వార్డులోని సిలికాన్ కాలనీలో గురువారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అధికారులతో కలిసి పర్యటించారు. కాలనీలో నెలకొన్న మంచినీటి సమస్యలను కాలనీవాసులను అడిగి తెలుసుకున్నారు. మంచినీటి పైప్‌లైన్‌తో పాటు, ఇంటింటికీ నల్లా ద్వారా మంచినీటిని సరఫరా చేయాలని కాలనీవాసులు చైర్మన్‌తో పాటు హెచ్‌ఎండబ్ల్యూఎస్ అధికారులకు విన్నవించారు. కార్యక్రమంలో కమిషనర్ రాజేంద్రకుమార్, వైస్ చైర్మన్ బండారి మల్లేష్ యాదవ్, హెచ్‌ఎండబ్ల్యూఎస్ ప్రాజెక్టు డైరెక్టర్–11 పి.రవికుమార్, ఆపరేషన్ డైరెక్టర్ యం.సురమి, చీఫ్ జనరల్ మేనేజర్ అమరేందర్‌రెడ్డి, జనరల్ మేనేజర్ నాగరాజు, నాగారం డీఈఈ సుదర్శనం, రఘు, మేనేజర్ సతీష్, స్థానిక కౌన్సిలర్ గోక కళావతి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తీజ్ ఉత్సవాలు

కుషాయిగూడ: గిరిజనుల సాంప్రదాయ ఉత్సవం తీజ్ పండగను గురువారం ఘనంగా నిర్వహించారు. హెచ్‌బీకాలనీ, కైలాసగిరి బంజారా అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్ సీనియర్ నేతలు బండారి లక్ష్మారెడ్డి, రాగిడి లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. చిన్నా పెద్ద తేడా లేకుండా సాంప్రదాయ దుస్తులు ధరించి గిరిజన వేషధారణలో నృత్యాలు చేస్తూ సందడి చేశారు. తమ కుటుంబ సభ్యులంతా సుఖంగా ఉండాలని కోరుకుంటూ అప్పుడే మొలకెత్తే వరినాట్లను నెత్తిన పెట్టుకొని దైవాన్ని కొలుచుకోవడం వారి సాంప్రదాయం. కార్యక్రమంలో నిర్వహకులు డాక్టర్ శ్రీనివాస్‌నాయక్, విద్యానాయక్, రాందాస్‌నాయక్, చంద్ర, నాను, లచిరాం, లింగానాయక్‌తో పాటుగా స్థానిక నేతలు గుమ్మడి జంపాల్‌రెడ్డి, పోలేపాక అంజయ్య, లాజర్, మల్లికార్జున్, నవీన్, అంజయ్య పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక



అధికారులకు వినతి అందజేస్తున్న ఘనాపూర్ సర్పంచ్ గోపాల్‌రెడ్డి, ఉప సర్పంచ్ పరమేశ్‌గౌడ్

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్‌లోని విద్యుత్ అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్ కార్యాలయంలో గురువారం విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీ జనాభా అధికంగా ఉన్న ఘనాపూర్ ఫకీర్‌టెక్యా, లింగాపూర్ తండాలో త్రీఫేజ్ లైన్ ఏర్పాటు చేయాలని, గ్రామంలో అవసరమైన 38 స్తంభాలు మంజూరు చేయాలని సర్పంచ్ గోపాల్‌రెడ్డి, మున్సిపాలిటీలో ఇనుప స్తంభాల స్థానంలో సిమెంట్ స్తంబాలు ఏర్పాటు చేయాలని, లో ఓల్టేజ్ సమస్యను పరిష్కరించాలని వైస్ చైర్మన్ మాధవరెడ్డి విద్యుత్ అధికారులకు వినతి అందజేశారు. అలాగే పలువురు బిల్లుల హెచ్చు తగ్గింపుల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో వేదిక చైర్మన్ జయరాజ్, సభ్యులు లలిత, శాభారాణి, గజేందర్, ఏడీఈ శ్రీనివాస్‌రెడ్డి, ఏఈ సతీశ్‌కుమార్, కౌన్సిలర్లు ఆంజనేయులుగౌడ్, నర్సింగ్‌రావు, ఎఫ్ఎస్‌సీఎస్ మాజీ డైరెక్టర్ ప్రభాకర్‌రెడ్డి, సిరాజ్, సంజీవగౌడ్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు



శామీర్‌పేట్: సీఎం కేసీఆర్ చొరవతో తెలంగాణలోని మారుమూల గ్రామాలు సైతం అభివృద్ధి చెందుతున్నాయని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. గురువారం మూడుచింతపల్లి మండలంలోని ఆయన పర్యటించారు. జగ్గంగూడ గ్రామంలో రూ.70 లక్షలతో ఎర్రకాలువ మరమ్మతులు, కొల్తూర్ గ్రామంలో రూ.30 లక్షలతో సీసీ రోడ్డు, ఉద్దమర్రిలో రూ.20 లక్షలతో సీసీరోడ్డు, యూజీడీ పనులను ప్రారంభించారు. మేడ్చల్ నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు ప్రత్యేక నిధులు కేటాయించి సమస్యలను పరిష్కరిస్తున్నామని తెలిపారు. కొత్తగా ఏర్పడిన మూడుచింతలపల్లి మండలంలోని గ్రామాల్లో 100 శాతం సీసీ రోడ్లు నిర్మించినందుకు సంతోషంగా ఉందని, స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతో పూర్తి చేసినట్లు వివరించారు. మూడుచింతలపల్లి మండలకేంద్రంలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు.

పంచాయతీ కార్మికుల కష్టాన్ని గుర్తించాలి



పంచాయతీ కార్మికులకు నిత్యావసర వస్తువులు అందజేస్తున్న తీన్మార్ మల్లన్న

కీసర: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పంచాయతీ కార్మికులు సుమారు 150 మందికి గురువారం కీసరలో తీన్మార్ మల్లన్న ఒక్కొక్కరికి 25 కేజీల బియ్యం బ్యాగ్‌తో పాటు 9 రకాల నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ పంచాయతీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలన్నారు. రాష్ట్రానికి, పంచాయతీరాజ్‌కు అవార్డులు వస్తున్నాయని గొప్పలు చెప్పుకుంటున్న ప్రభుత్వానికి, అవార్డుల వెనుక పంచాయతీ కార్మికుల కష్టం గుర్తించాలన్నారు. తీన్మార్ మల్లన్న టీమ్ సభ్యులు గణేష్, భానుచందర్, సందీప్, నవీన్, మహేష్, మోహన్, ఉపేందర్, బీజేపీ కీసర గ్రామశాఖ అధ్యక్షుడు బండారి శ్రీనివాస్‌రెడ్డి, నేతలు శివబాబు, సుధాకర్ పాల్గొన్నారు.

నీటి సమస్య రాకుండా ముందస్తు చర్యలు



ఘట్‌కేసర్: మున్సిపాలిటీలో నీటి సమస్య రాకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని చైర్ పర్సన్ పావనీజంగయ్య అన్నారు. మున్సిపాలిటీలోని 16, 17 వార్డులో నీటి కొరత రాకుండా ముందస్తు చర్యల్లో భాగంగా గురువారం బోరు వేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న రోజుల్లో అన్ని వార్డుల్లో నీటి సమస్య లేకుండా పరిష్కరిస్తామన్నారు. జంగయ్యయాదవ్, కుతుబ్, జహంగీర్, అస్లాం, ఫయూమ్, బలరాం, భూపతిగౌడ్, నారాయణ, రమేష్, విజయ్‌ముదిరాజ్, సాయి కిరణ్ పాల్గొన్నారు.

ఘనంగా మేరా మాటీ- మేరా దేశ్



మొక్కలు నాటుతున్న సైనికులు



అవుషాపూర్‌లో ప్రతిజ్ఞ చేయిస్తున్న సర్పంచ్ కావేరి, కార్యదర్శి సునీత

మేడ్చల్: స్వాతంత్ర్యం వచ్చి 75 వసంతాలు పూర్తయిన సందర్భంగా కేంద్ర ప్రభుత్వం చేపట్టిన మేరా మాటీ– మేరా దేశ్ కార్యక్రమంలో భాగంగా అధికారులు, ప్రజాప్రతినిధులు, సైనికులతో కలిసి శ్రీరంగవరం గ్రామంలో మొక్కలు నాటారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో సైనికులతో సమావేశం నిర్వహించి వారిని సన్మానించారు. జాతీయ జెండా ఎగురవేసి జాతీయ గీతాన్ని ఆలపించారు. మొక్కలు నాటి సైనికులను ఘనంగా సన్మానించారు. ఎంపీపీ రజిత రాజమల్లారెడ్డి, జెడ్పీటీసీ శైలజవిజయానంద్‌రెడ్డి, ఎంపీడీఓ పద్మావతి, సర్పంచ్ విజయానంద్‌రెడ్డి, ఎంపీటీసీ ప్రకాష్ గ్రామస్తులు నాయకులు పాల్గొన్నారు.



సెయింట్ పీటర్స్ కళాశాలలో మొక్కలు నాటుతున్న విద్యార్థులు

కీసరలోని పలు ప్రాంతాల్లో..

కీసర: మేరామాటీ–మేరాదేశ్ కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని వివిధ గ్రామాల్లో ఆయా గ్రామాల సర్పంచులు, పాలకవర్గం సభ్యుల ఆధ్వర్యంలో జాతీయ జెండా ఆవిష్కరణతో పాటు మొక్కలను నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. కీసరలో బీఆర్ఎస్ రాష్ట్ర నేత చామకూర భద్రారెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించి మొక్కలను నాటారు. గోధుమకుంటలో సర్పంచ్ ఆకిటి మహేందర్‌రెడ్డి, కీసరలో సర్పంచ్ మాధురివెంకటేష్, తిమ్మాయిపల్లిలో సర్పంచ్ పెంటయ్య, యాద్గార్‌పల్లిలో సర్పంచ్ పుట్టరాజు, కరీంగూడలో సర్పంచ్ గోపాల్‌రెడ్డి, భోగారంలో సర్పంచ్ కవితాజైహింద్‌రెడ్డి తదితరలుపాల్గొన్నారు.

అవుషాపూర్‌లో..

ఘట్‌కేసర్: ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా గురువారం అవుషాపూర్‌లో 'నా మట్టి – నా దేశం' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కావేరిమశ్చేందర్‌రెడ్డి జాతీయ జెండా ఆవిష్కరించి మొక్కలు నాటారు. విద్యార్థులు, పాలకవర్గ సభ్యులు, స్థానికులతో ప్రతిజ్ఞ చేయించారు. వార్డు సభ్యులు కుశలవరెడ్డి, రాధాయాదవ్, నాయకులు మశ్చేందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

మొక్కలు నాటిన విద్యార్థులు

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కళాశాలలో మేరీ మట్టి మేరా దేశ్ కార్యక్రమంలో భాగంగా ఎన్ఎస్ఎస్ విద్యార్థులు, అధ్యాపకులు మొక్కలు నాటారు. కళాశాల కార్యదర్శి టీవీ రెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీలత, పీఆర్వో రవిసుధాకర్, ఎన్ఎస్ఎస్ అధికారి రాజేశ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో సర్పంచులు, ప్రజాప్రతినిధులు, అధికారులు గ్రామస్తులు, విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు.



డబిల్‌పూర్‌లో సర్పంచ్ గీతాభాగ్యారెడ్డి, పాలకవర్గ సభ్యులు